క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతులు, మెయింటనెన్స్ నేపథ్యంలో నేడు(శనివారం) ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా విషయంపై వినియోగదారులు, ప్రజలు గమనించాలన్నారు.

నేడు నిరాహార దీక్ష

ములుగు: గిరిజన యూనివర్సిటీ ఏర్పాటులో కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ నేడు జిల్లా కేంద్రంలో నిరాహార దీక్ష నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ ములుగు మండల అధ్యక్షుడు బాదం ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉదయం 9గంటలకు జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహం ఎదుట చేపట్టనున్న కార్యక్రమానికి మాజీ ఎంపీ సీతారాంనాయక్ హాజరుకానున్నట్లు తెలిపారు.

సభను విజయవంతం చేయాలి



ములుగు రూరల్: హనుమకొండలోని ఆర్ట్స్‌అండ్ సైన్స్ కాలేజీలో నేడు(శనివారం) బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రధాని మోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆదిలాబాద్ మాజీ జెడ్పీ చైర్మన్ సుహాసినిరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు ఇమ్మడి రాకేష్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి బూత్‌ల వారిగా కార్యకర్తలు, నాయకులు అధికసంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు జవహర్‌లాల్, రవీంద్రాచారి, దొంతిరెడ్డి రవిరెడ్డి, రాకేష్‌రెడ్డి, కొత్త సురేందర్, కోయిల కవిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ నాయకుల నిరసన



ములుగు: విభజన చట్టం హామీ ప్రకారం ములుగులో గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేయకుండా వరంగల్ పర్యటనకు వస్తున్న ప్రధాన మంత్రి మోదీ గో బ్యాక్ అంటూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్లకార్డులతో శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట నిరసన తెలిపారు. గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు అయితే స్థానిక యువతకు విద్యా అవకాశాలు పెరుగుతాయని ఆశించిన జిల్లా ప్రజల ఆశలు అడియాశలు అయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర యూనివర్సిటీల ఇన్‌చార్జ్ రెహమాన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, జిల్లా కార్యదర్శి కుమ్మరి సాగర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి జోసెఫ్, రాజేశ్వరీ, పవన్, మమత పాల్గొన్నారు.

ఓడ బలిజలపై చిన్నచూపు



కన్నాయిగూడెం: రాష్ట్రంలోని ఓడబలిజ కులస్తులను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఓడ బలిజ కులస్తులు అన్నారు. మండలంలోని లక్ష్మీపురం, దేవాదుల గ్రామాల ఓడబలిజ కులస్తులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం బీసీ కులస్తులకు ప్రకటించిన రూ.లక్ష రూపాయల స్కీమ్ ఓడబలిజలకు వర్తింప చేయకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భాస్కర్ నర్సింహారావు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక



కన్నాయిగూడెం: తెలంగాణ నేతకాని మహార్ కుల హక్కుల మండల సమావేశం శుక్రవారం మండల కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు జాడి రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంతరావు హాజరై మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సునార్కని రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా మల్లేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కావిరి రాంబాబు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రచార కార్యదర్శి చిలుముల రాంబాబు, సురేందర్, కుమార్, వెంకటయ్య, రమేష్, సదానందం, అశోక్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె

వెంకటాపురం(కె): సమ్మె చేస్తున్న కార్మికులు



ములుగు: మద్దతు తెలుపుతున్న భిక్షపతి



ములుగు రూరల్: మద్దతు తెలుపుతున్న నాయకులు



తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం రెండో రోజు కొనసాగింది. ఈ సమ్మెకు పలు పార్టీల, సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు, నాయకులు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ ఉద్యోగుల వేతనాన్ని పెంచి వారి కుటుంబాలకు ఆసరాగా నిలువాలని కోరారు. వారిని వెంటనే పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



ములుగు: సమ్మెకు మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు



మంగపేట: మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు



వాజేడులో..



కన్నాయిగూడెంలో..

ప్రజాభిప్రాయం మేరకే క్వారీలు



వాజేడు: మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ గణేష్



వెంకటాపురం(కె)లో..

వాజేడు: ఇసుక క్వారీ నిర్వహణ కోసం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ గ్రామ సభలను శుక్రవారం టేకుల గూడెం, చెరుకూరు, ఏడ్జర్ల పల్లి గ్రామాల్లో నిర్వహించారు. ఈ గ్రామ సభలకు ములుగు అడిషనల్ కలెక్టర్ వైవీ గణేష్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ ఆర్ సిమిత హాజరయ్యారు. మూడు గ్రామసభల్లో వారు మాట్లాడుతూ షెడ్యూల్ ప్రాంతాల్లో ఇసుక క్వారీలను నిర్వహించాలంటే గ్రామసభల ద్వారా ప్రజల అభిప్రాయాలను తీసుకోవాలన్నారు. అందుకుగాను ప్రజల అభిప్రాయం మేరకే ఇక్కడ పనులు జరగనున్నట్లు వారు వివరించారు. ఇసుక క్వారీల మూలంగా పర్యావరణానికి ఇబ్బందులు ఉంటాయా? లేదా? అనే విషయం పైనే ప్రజల అభిప్రాయాలను సేకరించడం జరుగుతుందని తెలియజేశారు. ఇసుక క్వారీల మూలంగా యువతకు, గ్రామాలకు ఏ విధమైన లాభాలు ఉంటాయో చెప్పారు. గ్రామసభలకు వచ్చిన గ్రామస్తుల నుంచి సంతకాల సేకరణ చేశారు. గ్రామసభలకు హాజరైన ప్రజలు వారి అనుమతులను తెలియజేయడంతో తీర్మానాలను చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక క్వారీ నిర్వహణకు గ్రామసభ

వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఆలుబాక పంచాయతీ ముత్తారం గ్రామంలో ఇసుక రీచ్ నిర్వహణపై శుక్రవారం పెసా గ్రామ సభను ఆలుబాక సర్పంచ్ పూజారి ఆదిలక్ష్మి అధ్యక్షతన అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇసుక రీచ్ నిర్వహణ బాధ్యతలను ముత్తారం మహిళ గిరిజన ఇసు క్వారీ లేబర్ కాంట్రాక్టు మ్యూచ్‌వల్ ఎయిడెడ్ కోపరేటీవ్ సొసైటీకి అప్పగిస్తున్నట్లు గ్రామ సభలో సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో పెసా జిల్లా కోఆర్డినేటర్ కొమరం ప్రభాకర్, ఎంపీడీఓ అద్దూరి బాబు, గ్రామస్తులతో పాటు తదితరులు ఉన్నారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు



మాట్లాడుతున్న మల్లికార్జున్

వెంకటాపురం(కె): ప్రధాన నరేంద్ర మోదీ వరంగల్ పర్యటనలో భాగంగా సీపీఐ నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని, అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సీపీఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో అప్రజాస్వామిక అరెస్టులకు సీపీఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ.. రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర వర్గసభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, జిల్లా నాయకత్వాన్ని అరెస్టు చేయటం సమంజసం కాదన్నారు. బయ్యారంలో ఉక్కుపరిశ్రమ, హనుమకొండలో రైల్వే కోచ్ పరిశ్రమల హామీలు ఉన్నప్పటికీ ఇవ్వకపోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కట్ల రాజు, ముత్తయ్య, నరసింహారావు, లాల్ సింగ్, రాజు, కృష్ణార్జునరావు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందజేస్తున్న సతీశ్‌రెడ్డి

ములుగు: గోవిందరావుపేట మండలం చల్వాయి బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పూర్ణచందర్ కిడ్నీ సమస్యతో బాధపడుతూ నిమ్స్‌లో చికిత్సపొందుతున్నాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర రెడ్కో చైర్మన్ సతీశ్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో రూ.లక్ష విలువగల ఎల్‌ఓసీని బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. వైద్యానికి ఎంత ఖర్చు అయినా అండగా నిలబడతానని పూర్ణచందర్ సోదరుడు రవికి హామీ ఇచ్చారు.

తూతూ మంత్రంగా ప్రజావేదిక



టీఏ సదయ్యను ప్రశ్నిస్తున్న అధికారులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 14వ విడత ఉపాధిహామీ ప్రజావేదిక కార్యక్రమాన్ని ఎంపీడీఓ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రెండేళ్ల పాటు జరిగిన పనులు, అవకతవకలను ప్రజల ముందు నిర్వహించాల్సిన ప్రజావేదికను ప్రజలు లేకుండా తూతూ మంత్రంగా చేపట్టారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు, పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు జరిమానాలను విధించి చేతులు దులుపుకున్నారు. పేదలకు పని కల్పించడానికి ప్రభుత్వం నుంచి ఎస్ఆర్ఈజీఎస్ 2021 నుంచి 2023 వరకు రూ.11 కోట్ల 93 లక్షల 43వేల 125 నిధులు విడుదలయ్యాయి. రెండు సంవత్సరాల తర్వాత ఉపాధిహామీ పనులపై సోషల్ ఆడిట్ జరగడంతో ఫీల్డ్ అసిస్టెంట్లు సంబంధిత అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఎక్కువ మొత్తంలో నిధులు కాజేసినట్లు ఆడిట్‌లో వెల్లడైంది. టెక్నికల్ అసిస్టెంట్లు సైతం చేతివాటం ప్రదర్శించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజా వేదికలో కేవలం రూ.1 లక్ష57 వేల రూపాయలు రికవరీ మాత్రమే చేస్తున్నట్లు అధికారులు వెల్లడించడం అవినీతి అధికారులకు వంతుపాడినట్లుగా ఉంది. సోషల్ ఆడిట్‌పై అనేక అనుమానాలు రేకెత్తుతున్నాయి. కలెక్టర్ చొరవతీసుకుని ఉపాధిహామీ లో జరిగిన అవినీతి అక్రమాలపై దృష్టిపెట్టాలని ప్రజా ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ ఆడిట్‌లో అడిషనల్ డీఆర్‌డీఓ పీడీ బాలకృష్ణ, ఏపీడీ వెంకటనారాయణ, సోషల్ ఆడిట్ ఇన్‌చార్జ్ రాజశేఖర్, క్వాలిటీ కంట్రోల్ రామానందం, అంబుడ్స్‌మెన్ రాజు నాయక్, ఎంపీపీ అంతటి విజయ, కో ఆప్షన్ సభ్యులు వలియాబి, ఎస్ఆర్ పీ సురేందర్ ఎంపీడీఓ కుమార్, ఈజీఎస్ ఏపీఓ అంకుస్ తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

ములుగు రూరల్: కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం గోవిందరావుపేట మండలంలోని పస్రాలో జరిగిన సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 9 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ విభజన హామీలు అమలు చేయలేదని అన్నారు. విభజన హామీలను అమలు చేయకుండా ప్రధాని మోదీ వరంగల్ పర్యటన అర్థం లేదని అన్నారు. ములుగు జిల్లాలో గిరిజన యూనివర్సిటీ కోసం ప్రభుత్వం 576 ఎకరాల భూమిని కేంద్ర ప్రభుత్వానికి అప్పగించినప్పటికీ పనులు ప్రారంభం కావడం లేదని ఆరోపించారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీల ఏర్పాటు ప్రకటనలు చేయాలని అన్నారు. గవర్నర్ల జోక్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయని అభిప్రాయపడ్డారు. మోదీ పర్యటనను వ్యతిరేకిస్తూ జిల్లా వ్యాప్తంగా శనివారం నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. పొదిళ్ల చిట్టిబాబు, గొంది రాజేష్, నాగరాజు, పోశాలు, సూర్యనారాయణ, మల్లారెడ్డి, సంజీవ, గణేష్, అశోక్, రాంబాబు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

వెంకటాపురం(ఎం): గీత కార్మికుడికి గాయాలైన సంఘటన మండలంలోని లక్ష్మీదేవిపేటలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తాళ్లపల్లి కుమారస్వామి గురువారం వృత్తిరీత్యా తాటి చెట్టు ఎక్కి దిగుతుండగా ప్రమాదవశాత్తు జారి పడటంతో చేతికి, కాళ్లకు తీవ్రమైన గాయాలయ్యాయి. దీంతో స్థానికంగా వైద్య చికిత్సలు చేసుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ మేరకు లక్ష్మీదేవిపేట కల్లు గీత కార్మిక సంఘం అధ్యక్షుడు పెరుమండ్ల పున్నం పరామర్శించారు. గాయాలైన కుమారస్వామికి తక్షణ సహాయం అందించాలని సంబంధిత అధికారులను కోరారు. ఆయన వెంట అనగొండ సంపత్, సమ్మయ్య ,అశోక్, శరత్ ఉన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ సురేష్‌కుమార్

ఏటూరునాగారం: సీజనల్ వ్యాధులపై వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సామాజిక ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ సురేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సామాజిక ఆస్పత్రిలో సీజనల్ వ్యాధులు, డెలివరీలు, వైద్యశాలలో అందుతున్న సేవలపై వైద్యులు, సిబ్బంది సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షాకాలం ప్రారంభం అయ్యిందని, సీజనల్, అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి మెరుగైన సేవలు అందించాలని, సాధారణ కాన్పులు, తల్లి బిడ్డల ఆరోగ్యం విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వైద్యశాలలో అన్ని రకాల మందులు, పరీక్షలు అందుబాటులో ఉన్నందున మెరుగైన సేవలు అందించాలన్నారు. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైద్యులు ఉత్తమ్, మౌనిక సిబ్బంది శారద, నాగదేవి, స్వరూప, సావిత్రి,జ్యోస్నా, సరోజిని, ఇంద్రావతి, రాజు, భాస్కర్, కృష్ణవేణి, మానస, నర్సింగరావు, సునీల్, రంజిత్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి నిఖిల్‌కుమార్

మంగపేట: ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కారం నిఖిల్‌కుమార్ సూచించారు. మండలంలోని బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిల్‌కుమార్ ఆధ్వర్యంలో వాగొడ్డుగూడెం పంచాయతీ పరిధిలోని కన్నాయిగూడెంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వైద్య సిబ్బందిలో ఇంటింటికీ వెళ్లి పరిసరాలను పరిశీలించి ప్రజల ఆరోగ్య పరిస్థితులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడుతూ.. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధుల బారి పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

సికిల్ సెల్ అనీమియా డిసీస్ రక్తపరీక్షలు

గ్రామంలోని జీపీఎస్ పాఠశాలలోని విద్యార్థులకు సికిల్ సెల్ అనీమియా డిసీస్ రక్త పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. ఎర్రరక్త కణాలు జన్యు మార్పిడి వలన కొడవలి ఆకారంలోకి మారి శక్తిని కోల్పోయి అవి చేయాల్సిన పని చేయక పోవడం వలన 18 సంవత్సరాల వయస్సు లోపు పిల్లల్లో రక్త హీనత ఏర్పడుతుందన్నారు. దీనివలన పిల్లలు ఇతర ఆరోగ్య సమస్యల బారినపడే అవకాశం ఉందన్నారు. సికిల్ సెల్ అనీమియాను తొలి దశలోనే గుర్తించి పిల్లలకు ఇతర వ్యాధులు సక్రమించకుండా కాపాడుకొవచ్చన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ జయశ్రీ, హెల్త్ అసిస్టెంట్ పొడెం రవికుమార్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

వెంకటాపురం(ఎం): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఆటపాటల ద్వారా తెలియజేశారు. శుక్రవారం మండలంలోని తాళ్లపాడు సెంటర్ వద్ద జిల్లా కలెక్టర్ సమాచార పౌరస మండలం అధికారి ఆదేశాల మేరకు వాంకుడోత్ రమేష్ కళాబృందం సారథి కళాకారులు సీజనల్ వ్యాధులపై ప్రజల ప్రవర్తన ఉండాలని పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఆటపాటల ద్వారా చైతన్యపరిచారు. ఈ కార్యక్రమంలో సారథి కళాకారులు మార్త రవి, ఎండీ రహీముద్దీన్, దేవేందర్, గోల్కొండ బుచ్చన్న, రేలా విజయ్, రేలా కుమార్, ఈర్ల సాగర్, రాగుల శంకర్, భాస్కర్, తిరుపతి, కనకం రాజేందర్, సాలమ్మ, శ్రీలత, శోభ, దీపక్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు



కాటాపూర్‌లో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



వెంకటాపురం(కె)లో..

ఎస్ఎస్ తాడ్వాయి: మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని తాడ్వాయి, కాటాపూర్, కొత్తూరు గ్రామాలల్లో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ పుల్లూరి కరుణాకర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు సారంగపాణి, నాయకులు నవీన్, అక్షయ్, చిరంజీవి, సర్పంచ్ పుల్లూరి గౌరమ్మ, ఎల్‌పీ నర్సయ్య, ఎస్ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ చైతన్య, రాకేష్, స్వామి, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): మండలంలో ఘనంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భావ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను రాష్ట్ర నాయకుడు నరేంద్ర మాదిగ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు ఉద్యమం కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాసం మహేష్, కోడారి ఆనందరావు, తిరుపతి, సమ్మయ్య, నర్సయ్య తదితరులు ఉన్నారు.

వాహనాలకు వేలంపాట

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో పలు కేసుల్లో పట్టుబడిన మూడు ద్విచక్రవాహనాలు, ఆటోలను స్క్రాప్ కింద శుక్రవారం వేలం పాట వేయగా రూ.1లక్ష 61వేయి 1600ల ఆదాయం వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ ఫకీరా తెలిపారు. నిబంధనలకు లోబడి వేలం పాట వేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వెంకన్న, కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీపై అక్రమ కేసులు ఎత్తివేయాలి



ధర్నా చేస్తున్న నాయకులు

ములుగు: రాహుల్ గాంధీపై గతంలో బనాయించిన పార్లమెంట్ అనర్హత వేటు, పరువునష్టం దావా కేసులను వెంటనే ఎత్తివేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారిపై ధర్నా, నిరసన తెలిపారు. అనంతరం జరిగిన సమావేశంలో అశోక్ మాట్లాడుతూ.. రాహుల్ గాంధీపై బీజేపీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని అన్నారు. రెండేళ్ల పాటు జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇవ్వడం అప్రజాస్వామికం అని అన్నారు. భారత్ జోడో యాత్రలో ప్రజల కష్ట సుఖాలను తెలుసుకుంటూ కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకరావడాన్ని చూసి ఓర్వలేక కొంత మంది వారి పలుకుబడితో ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు ఎండీ చాంద్‌పాషా, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవియాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్లు నల్లెల భరత్‌కుమార్, ఆకుతోట చంద్రమౌళీ, రసపుత్ సీతారాంనాయక్, ఎంపీటీసీ మావురపు తిరుపతిరెడ్డి, గుండెబోయిన నాగలక్ష్మీ, ములుగు పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, షకీల్, నాగరాజు, శర్ఫోద్దీన్, ఆలోత్ దేవ్‌సింగ్, శంకరయ్య, వంశీకృష్ణ, బోయిని రాజు, రఘు, చక్రపు రాజు పాల్గొన్నారు.

గిరిజన యూనివర్సిటీ తరగతులను ప్రారంభించాలి

రాష్ట్ర విభజన చట్టంలో రూపొందించిన విధంగా జిల్లాలో వెంటనే గిరిజన యూనివర్సిటీ తరగతులను ప్రారంభించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లాకేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు స్పందించని పక్షంలో నేడు(శనివారం) వరంగల్ పర్యటనకు వస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటనను అడ్డగిస్తామని హెచ్చరించారు. ఇందులో భాగంగా ప్రభుత్వాలు అవలంబిస్తున్న నిర్లక్ష్యపు ధోరణిని వ్యతిరేకిస్తూ నేడు(శనివారం) జిల్లా కేంద్రం బంద్‌కు పిలుపునిచ్చారు. వర్తక, వాణిజ్య వ్యాపారులు సహకరించాలని కోరారు.

ఇసుక లారీ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు



గాయపడిన మల్లేష్

ఏటూరునాగారం: మంగపేట మండలంలోని ఇసుక క్వారీ నుంచి వరంగల్ వైపు వస్తుండగా ఏటూరునాగారం మండల పరిధిలోని జీడివాగు వద్ద ఇసుక లారీ బోల్తా పడింది. ఈ లారీ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కపోవడంతో ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ సిబ్బందితో వెళ్లి బయటకు తీశారు. నల్గొండ ప్రాంతానికి చెందిన లారీ డ్రైవర్ మల్లేష్‌కు కాలు విరిగి గాయపడడంతో ఏటూరునాగారం ఆస్పత్రికి తరలించారు.